E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 31-03-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:88 || పేజీలు–6
www.ekaburu.com

## డాలరు ధాటికి రూపీ విలవిల



భారత కరెన్సీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూపాయి విలువ భారీ పతనానికి గురైంది. సోమవారం (మార్చి 30, 2026) నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 95.45 స్థాయికి పడిపోయింది. ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ ఈ అసాధారణ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపేలా కనిపిస్తోంది. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల మంట దీనికి ప్రధాన కారణాలుగా ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

04



# ఆహార కల్తీపై ఉక్కుపాదం

- ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థ
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- పంటల మార్పిడిపై రైతుల్లో అవగాహన తీసుకురావాలి
- సన్నబియ్యంతో పాటు.. మరిన్ని నిత్యావసరాలను అందించే ప్రణాళిక
- 50 శాతం సీట్ల పెంపుతో దక్షిణాదికి నష్టం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి

రావణుడు లేకుంటే రాముడి గొప్పతనం తెలియదు. శకుని లేకపోతే కురుక్షేత్రం జరిగేది కాదు.. కృష్ణుడి గొప్పతనం తెలిసేది కాదు. ఎవరు ప్రజలకు మంచి చేస్తారో వారే కథానాయకుడు అవుతారు. మా ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా పాలన చేస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన అందించింది. కేసీఆర్ అలా పాలించడం వల్లే నా మంచితనమేమిటో ప్రజలకు అర్థమైంది. కేసీఆర్‌ను కుమారుడు, అల్లుడే ఫాంహౌస్‌లో నిర్బంధించారనేది నాకున్న సమాచారం. కేసీఆర్ కంటే హరీశ్‌రావు ప్రమాదకారి.

సీఎం రేవంత్‌రెడ్డి

ఈకబురు,హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆహార కల్తీ నియంత్రణకు ఈగల్, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నట్లు ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల చట్టాలను అధ్యయనం చేసి.. తెలంగాణకు తగిన పకడ్బందీ వ్యవస్థ రూపొందిస్తామన్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలనే బృహత్తర లక్ష్యంతో ప్రారంభించిన సన్నబియ్యం పథకం విజయవంతమైందని, తదుపరి లక్ష్యం దిశగా దృష్టి సారించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సాంకేతికతల పెంపుతో పాటు.. పౌష్టికాహారం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

మిగతా 2లో

## దళిత క్రైస్తవులను ఎస్సీలు కాదనడం సరికాదు

ఈ కబురు,ఖైరతాబాద్, :

దేశంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దు చేయడం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే కుల వ్యవస్థనే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. 02





# దేశంలో నక్సలిజం అంతం

### తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 21 రోజుల భీకర పోరు..

ఈకబురు, న్యూఢిల్లీ: దశాబ్దాలపాటు దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను వణికించిన వామపక్ష తీవ్రవాదం (నక్సలిజం) దాదాపు అంతమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం లోక్‌సభ సాక్షిగా ప్రకటించారు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు చేపట్టిన చరిత్రాత్మక 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' విజయవంతం కావడంతో తెలంగాణ పూర్తిస్థాయిలో నక్సల్‌స్‌రహిత రాష్ట్రంగా మారిందని చెప్పారు. దేశవ్యాప్తంగా నక్సలిజాన్ని పారదోలేందుకు భద్రతా బలగాలు చేసిన త్యాగాలను కొనియాడుతూ సభలో సెల్యూట్ చేశారు. అదే సమయంలో వామపక్ష తీవ్రవాదానికి దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో వివరిస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మిగతా 2లో


## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

### గవర్నర్‌కు భారాస వినతి
### మైనింగ్ అక్రమాలపై సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి



02

ఈకబురు,హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు భారాస ఫిర్యాదు చేసింది. ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, మైనింగ్ అక్రమాలపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతృత్వంలో హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గవర్నర్‌తో వారి భేటీ గంటకు పైగా కొనసాగింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ 'పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం.



6

## రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం ...రాయల్స్ బౌలర్ల విజృంభణ.. కుప్పకూలిన సీఎస్‌కే

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఇవాళ (మార్చి 30) జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు చెలరేగిపోయారు. వీరి ధాటికి సీఎస్‌కే బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. గౌహతిలోని బర్సపరా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన రాయల్స్ సీఎస్‌కేను 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసింది.తొలి బంతి నుంచే రాయల్స్ బౌలర్లను ఎదుర్కొనేందుకు సీఎస్‌కే బ్యాటర్లు తెగ ఇబ్బంది పడ్డారు. ఆరంభ ఓవర్లలో నంద్రే బర్గర్,



3

## త్వరలో ఒప్పందం కుదరకపోతే.. సర్వనాశనమే: ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

ఈ కబురు : ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే..



## కాంగ్రెస్, భాజపాల మధ్య పెట్రో మంట

02

**ఈ-కబురు, హైదరాబాద్: తెలంగాణ వ్యాట్ సవరణ బిల్లుపై అధికార కాంగ్రెస్, భాజపాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు చోటుచేసుకున్నాయి**

## ఎల్డీఎఫ్‌తో భాజపా కుమ్మక్కు

### కేరళ ఎన్నికల ర్యాలీలో రాహుల్



ఈకబురు, పథనంతిట్ట, కొట్టాయం: ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ.. తాజాగా పాలక్కాడ్ ప్రసంగంలో శబరిమల బంగారం చోరీ అంశంపై మాట్లాడటం ఎందుకో మర్చిపోయారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. అయ్యప్ప ఆలయంలో వామపక్ష నాయకులు బంగారు తాపడాలను దొంగిలించి ఇత్తడిని పెట్టారన్న

మిగతా 2లో

## జీవో 317 బాధితులకు న్యాయం చేయండి



వన్ టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు బదిలీ చేయండి

స్థానికతను నిర్ధారించే ఉత్తర్వుల్లో మార్పులు చేయండి

సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత లేఖ

మిగతా 3లో

## ఏపీలో గృహ ప్రవేశాల పండుగ



ఈ ఏడాది డిసెంబర్‌లోపు మరో 4.5 లక్షల ఇళ్లు, సంక్షేమంలో మర్చిపోలేని మాసంగా మార్చి

విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టలేదు,

ఈ కబురు, అమరావతి :

ఈ ఏడాది చివరి నాటికి మరో 4.5 లక్షల గృహాలను పేదవారికి నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరు మాసాల్లో గృహ ప్రవేశాలు చేసేలా లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ఇప్పటి వరకూ 5.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని వివరించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30కి పైగా చోట్ల నిర్మించిన 2,50,983 టిడ్కో, పీఎంఏవై ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. తాను హాజరైన ఒక్క తిరుపతి జిల్లాలోనే 15,659 ఇళ్లను నిర్మించి ఇచ్చామని సీఎం వివరించారు. నాయుడుపేటలోని పుదూరు వద్ద జీ ప్లస్ 3 తరహాలో నిర్మించిన భవన సముదాయాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పార్కులు, వాకింగ్ ట్రాక్, విశాలమైన రహదారులు, అంగన్‌వాడీ,

మిగతా 2లో

# చొరబాట్లు.. ఎన్నికల అంశం కాదు

### అస్తిత్వ పరిరక్షణ, దేశ భద్రత ముఖ్యం

### అస్సాంలో హ్యాట్రిక్ లక్ష్యంగా పని: మోదీ



ఈకబురు, దిల్లీ: అస్సాంలో చొరబాట్లు కేవలం ఎన్నికల అంశం కాదని.. ఆ రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణ, దేశ భద్రత దానితోనే ముడిపడి ఉన్నాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. చొరబాటుదారులకు కొమ్ముకాయడం ద్వారా భూముల దురాక్రమణను కాంగ్రెస్ అనుమతిస్తోందని ఆరోపించారు. అస్సాం భాజపా బూత్‌స్థాయి కార్యకర్తల్ని ఉద్దేశించి సోమవారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. చాలాకాలం పాటు అస్సాంలో అస్థిరత కొనసాగిందని, పదేళ్ల క్రితం భాజపా డబుల్ ఇంజిన్ సర్కారు కొలువుదీరిన తర్వాత శాంతిని నెలకొల్పే చర్యలన్నీ తీసుకుంటూ వచ్చిందని మోదీ వివరించారు. ఆనాటి దుష్పరిపాలన గురించి నవతరం ఓటర్లకు తెలియజెప్పాలని సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందనేది వివరించాలని చెప్పారు. "చొరబాటుదారులు ఎక్కడ స్థిరపడినా చిన్నవ్యాపారాలను గుప్పిటపడతారు. స్థానికుల ఉపాధి అవకాశాలను హరిస్తారు. భూముల్ని కబ్జా చేస్తారు. ఆక్రమణల్ని కాంగ్రెస్ ప్రోత్సహించిన తీరు, ప్రజల హక్కుల్ని భాజపా రక్షిస్తున్న విధానం గురించి ప్రజలకు తెలియాలి" అని తెలిపారు.

మిగతా 2లో

## ఎల్పీజీ సరఫరా పెంపునకు కేంద్రానికి లేఖ రాస్తాం

ఈ కబురు,ఖైరతాబాద్, : హైదరాబాద్: వాహనాలకు ఎల్పీజీ సరఫరాలో ఏర్పడ్డ సంక్షోభాన్ని నివారించేందుకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీకి లేఖ రాస్తానని, తెలంగాణకు సరఫరా పెంచాలని కోరతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



03

ఈ-కబురు

31-03-2026
మంగళవారం
E-kaburu.com

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

ఎలాంటి అనుమతులు లేకుండా రెండు సంవత్సరాలుగా నిరాటంకంగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను రెవెన్యూ మంత్రి కుటుంబం కొల్లగొడుతోందని వివరించాం. ఈ అంశాన్ని శాసనసభలో లేవనెత్తి, మంత్రిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తే.. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభ నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాం. ముఖ్యమంత్రే హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున సీఐడీ విచారణతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కూడిన సభా సంఘాన్ని లేదా, ఇండిపెండెంట్ జ్యుడిషియల్ విచారణ కావాలని శివప్రతాప్ శుక్లాను కోరాం. అన్ని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం దిగిరాకపోతే ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. బాధితులకు న్యాయం జరిగేదాకా, అక్రమ మైనింగ్ ఆగే వరకు పోరాటం చేస్తాం. ఎవరు అడిగినా విచారణకు ఆదేశిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట మార్చి, పొంగులేటి పైన విచారణ చేయకుండా వెనక్కిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేస్తే అమృత్ కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి, హిల్ట్ పాలసీ.. ఇలా దాదాపు 14 అంశాల పైన ఆధారాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి పొంగులేటిపై చర్యలు తీసుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి' అని కేటీఆర్ వెల్లడించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మధుసూదనాచారి, సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, సునీతారెడ్డి, కోవ లక్ష్మి, ఎల్.రమణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గన్‌పార్కులో భారాస ఎమ్మెల్సీల నిరసన

నారాయణగూడ, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి మైనింగ్ వ్యవహారంపై సభాసంఘం వేయాలి లేదా హైకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని భారాస ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద వారు నిరసన తెలిపారు. ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్, సురభి వాణీదేవి, తాతా మధు, పోచంపల్లి శ్రీనివాస్, నవీన్‌రెడ్డిలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్సీలు పాదయాత్రగా శాసనమండలికి వెళ్లారు.

## చొరబాట్లు.. ఎన్నికల అంశం కాదు

''అస్సాం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యంత అవసరం. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. గత పదేళ్లలో నిజాయితీగా అమలుచేసిన ఆ ఒప్పందాల వల్ల అస్సాంలో స్థిరత్వం నెలకొంది. మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవి. అవి కాగితాలకే పరిమితమయ్యేవి. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో ఆ పార్టీ కుదుర్చుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదు'' అని మోదీ విమర్శించారు. ఎన్నికల సమయంలో కృత్రిమ మేధతో రూపొందించి ప్రచారం చేస్తున్న ఏఐ వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అస్సాంలో హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తేయాకు తోటల్లో పోలింగ్ కేంద్రాలను కార్యకర్తలు సందర్శించి, చాయ్ పే చర్చా వంటివి నిర్వహించి.. ప్రజల గాథలు తెలుసుకోవాలని సూచించారు.

వారికి కుటుంబం.. మాకు దేశం ముఖ్యం

కాంగ్రెస్, డీఎంకేలకు ప్రజా ప్రయోజనాల కంటే కుటుంబమే తొలి ప్రాధాన్యమని, తమకు మాత్రం దేశమే ముఖ్యమని మోదీ చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఈ విషయం చెప్పాలని సూచించారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని భాజపా బూత్‌స్థాయి కార్యకర్తల్ని ఉద్దేశించి కూడా ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. కాంగ్రెస్‌డీఎంకేలు అధికారంలోకి వచ్చేందుకు పుదుచ్చేరి ఓటర్లు అనుమతించబోరని ఆశాభావం వ్యక్తపరిచారు. పుదుచ్చేరిలో ఆ పార్టీల నిర్వాకాలను భాజపా శ్రేణులు బలంగా ఎండగడుతున్నాయని ప్రశంసించారు. ఆ రెండు పార్టీల ప్రవర్తన ఇప్పటికీ మారడం లేదని, అవి పరస్పరం కలహించుకుంటూనే ఉంటాయని విమర్శించారు.

## ఎల్డీఎఫ్‌తో భాజపా కుమ్మక్కు

విషయాన్ని ఆయన మర్చిపోయినట్లున్నారని వ్యంగాస్త్రాలు సంధించారు. సోమవారం కేరళలోని పథనంథిట్ట, కొట్టాయం జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు.

'ప్రధాని మోదీ చర్యలు రెండు విషయాలను స్పష్టం చేస్తున్నాయి. మొదటిది.. భాజపాఎల్డీఎఫ్ కలిసి పని చేస్తున్నాయని.. రెండోది హిందూ మతం, ఆలయాలను మోదీ పట్టించుకోరని.. ఓట్లు వస్తాయంటేనే ఆయన ఆలయాల గురించి మాట్లాడతారు' అని విమర్శించారు. ఎల్డీఎఫ్ వామపక్ష పార్టీగా ప్రవర్తించడం లేదని, భాజపా మాదిరి లాభాలను ఆశించే సంస్థలా పని చేస్తోందని వ్యాఖ్యానించారు. 'కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని కాషాయం పార్టీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో వారికి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. ఎల్డీఎఫ్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అందరికీ తెలుసు. భాజపా నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందువల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. నాపై 36 కేసులున్నాయి. 55 గంటలు నిరంతరాయంగా నన్ను విచారించారు' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'స్వర్ణం కట్టధు ఆరప్పా' (బంగారాన్ని ఎవరు దొంగిలించారు అయ్యప్పా) అనే పాటను పాడి వినిపించారు. ఈ పాటను గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా యూడీఎఫ్ కార్యకర్తలు ప్రాచుర్యంలోకి తెచ్చారు. కేరళకు మహిళా ముఖ్యమంత్రి రావాలని తాను ఎదురుచూస్తున్నట్లు పుత్తప్పళిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్, భాజపాల మధ్య పెట్రో మంట



పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించిందని.. తెలంగాణ సర్కారు వ్యాట్ ఎందుకు తగ్గించడం లేదని భాజపా శాసనసభపక్ష ఉపనేత పాయల్ శంకర్ ప్రశ్నించారు. 'పెట్రోల్, డీజిల్‌తో రైతు జీవితం ముడిపడి ఉంది. వీటిని రాష్ట్రంలో జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే బాగుంటుంది' అని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు తీవ్రంగా స్పందించారు. ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాల్ని దృష్టిలో పెట్టుకునే కేంద్రం తాత్కాలిక నిర్ణయం తీసుకుందని పొన్నం విమర్శించారు. తగ్గించిన ధరల్ని ఏడాదిపాటు పెంచకుండా ఉంటారా? అని సవాల్ విసిరారు. పాయల్ శంకర్ స్పందిస్తూ.. 'తెలంగాణలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ.107.46 ఉంది. ఎన్నికల్లేని రాష్ట్రాలు ఉత్తర్‌ప్రదేశ్‌లో రూ.94.60, దిల్లీలో రూ.94.70, ఉత్తరాఖండ్‌లో రూ.93.40 మాత్రమే ఉంది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 20% తగ్గించింది కదా?' అని ప్రశ్నించారు.

రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని మంత్రి జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణ నుంచి కేంద్రానికి రూ.4.6 లక్షల కోట్ల ఆదాయం వెళితే, రాష్ట్రానికి వచ్చింది రూ.1.36 లక్షల కోట్లు మాత్రమే. బిహార్ నుంచి కేంద్రానికి రూ.93 వేల కోట్లు వెళితే, ఆ రాష్ట్రానికి ఏకంగా రూ.6.25 లక్షల కోట్లు ఇస్తున్నారు. తెలంగాణ పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది' అంటూ ధ్వజమెత్తారు. 'తెలంగాణలో రైల్వేలు, రోడ్లు, విమానాశ్రయాలు, రీజినల్ రింగ్‌రోడ్లకు నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది కదా?' అని పాయల్‌శంకర్ అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణకు సహకరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, మంత్రులు మాత్రం భిన్నంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన మేరకు నిధులు రావట్లేదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశంలో తెలంగాణలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని తగ్గించాలని భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కోరారు. మంత్రి జూపల్లి ప్రవేశపెట్టిన ఈ బిల్లు సోమవారం విస్తృత చర్చ అనంతరం శాసనసభ ఆమోదం పొందింది.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

'రైతుకు తాను పండించిన పంటకు న్యాయమైన ధర నిర్ణయించే హక్కు లేకపోవడం పెద్ద శాపమని ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకోసమే కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. పంటల మార్పిడి విధానం ద్వారా వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం పెంచడం, జిల్లాల వారీగా శాస్త్రీయ అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా రైతుకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా.. శాసనసభ భవనంలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మండలి కమిటీ హాలులో మంత్రులు ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

100 శాతం సన్నబియ్యం ఇవ్వడానికి సిద్ధం

''నలభై ఏళ్లుగా తెలంగాణ పేదలకు రేషన్ ద్వారా దొడ్డుబియ్యమే పంపిణీ అవుతూ వచ్చింది. దీంతో ఆ బియ్యాన్ని సన్నాలుగా మార్చే మాఫియా విస్తరించింది. ఈక్రమంలో పేదలు తినగలిగే సన్నబియ్యం ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ జనాభాలో 86 శాతం మంది ప్రజలు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. భవిష్యత్తులో ఇది 90 శాతాన్ని అధిగమించవచ్చు. 100 శాతం మంది ఈ పథకం పరిధిలోకి వచ్చినా.. వారికి సన్నబియ్యం అందజేయడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సోనియా గాంధీ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టానికి రాష్ట్రంలో సరైన న్యాయం జరగాలని సంకల్పించాం. పిల్లలు ఆరోగ్యంగా, చదువులో రాణించాలంటే పుష్టికరమైన ఆహారం అవసరం. అందుకే వ్యవసాయ వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తున్నాం. పేదల ఆకలి తీర్చడం, రైతుకు న్యాయం చేయడం, కల్తీ మాఫియాను అదుపు చేయడం.. ఈ 3 లక్ష్యాలతో ముందుకెళ్తున్నాం. సన్నబియ్యానికి అయ్యే ఆర్థికభారం కేంద్రం భరిస్తే.. ప్రధాని మోదీ బొమ్మ పెట్టి పంపిణీ చేస్తాం.

రైతులకు ఆర్థిక బలం

సన్న బియ్యం పథకం అమలు చేయాలంటే.. ఇక్కడే ఉత్పత్తి పెరగాలి. అందుకే సన్నాల సాగుకు ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాం. ఎకరాకు ఏడాదికి రూ.25,000 లాభాన్ని అదనంగా అందించాం. ఆ పంటను ఇక్కడే కొని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నాం. సన్నబియ్యం పథకం రైతులకు ఆర్థిక బలాన్ని చేకూరుస్తోంది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే తీవ్రమైనది. ప్రజల ఆకలిని సొమ్ము చేసుకునే వారిని నియంత్రించేందుకు.. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం



పకడ్బందీ చట్టాలు తీసుకొచ్చింది. నేడు పటిష్ఠ నిఘా వ్యవస్థ నెలకొల్పనుంది. దేశంలో నిత్యావసర ధరలు తెలంగాణలోనే అతి తక్కువగా ఉన్నాయి.

అన్నదాతల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే గతంలో కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చింది. వరితో పాటు.. వాణిజ్య, పోషకాహార పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందుకోసం ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఆ శాఖ అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలని యోచిస్తున్నాం. ఈ కమిటీ జిల్లాల వారీగా పంటల మార్పిడి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తుంది. రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యంతో పాటు.. ఇతర నాణ్యమైన నిత్యావసరాలను అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇప్పుడెంత అంతరముందో.. అదే నిష్పత్తిలో లోక్‌సభ సీట్లు పెంచాలి

**- సీఎం రేవంత్‌రెడ్డి**

ఇప్పుడు రాష్ట్రాల్లో ఉన్న పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వం ఆలోచన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో ఉత్తర, దక్షిణ భారతాలకు ఇప్పుడున్న విధంగానే అంతరం ఉండాలి. అలాకాకుండా జనాభా లెక్కల మేరకు సీట్లు పెంచినా.. 50 శాతం పెంచినా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది. ఇప్పుడు 543 లోక్‌సభ సీట్లున్నాయి. ఇందులో 50 శాతం అంటే 272 సీట్లు పెరిగితే.. మొత్తం 815 అవుతాయి. ఇందులో 33శాతం మహిళా రిజర్వేషన్ సీట్లను కేటాయించాలని కేంద్రం యోచిస్తోంది. 50 శాతం ప్రకారమే లోక్‌సభ సీట్లు పెరిగితే.. దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లతో సంబంధం లేకుండానే.. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరుగుతుంది. అదే పరిస్థితి ఎదురైతే.. దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకునేవారే ఉండరు. నియంతృత్వం ఏర్పడుతుంది. అందుకే ఇప్పుడు దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల సీట్లకు ఎంత గ్యాప్ ఉందో.. అదే నిష్పత్తిలో పెంచాలి. దీనిపై ప్రజల్లో చర్చ జరగాలి. పార్టీలకు అతీతంగా పోరాడాలి. దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి కొలమానాల ఆధారంగా సీట్లను పెంచాలి. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై ఏపీ కలిసిరాకపోతే.. ఆ రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తారు. మాది జాతీయ పార్టీ అయినా.. అన్యాయంపై గళమెత్తేందుకు మా పార్టీ స్వేచ్ఛ ఇచ్చింది. తెలంగాణ నుంచి వసూలు చేస్తున్న ప్రత్యేక సెస్ నుంచి రూపాయి కూడా రాష్ట్రానికి తిరిగి ఇవ్వడం లేదు''

# దేశంలో నక్సలిజం అంతం

ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్.. భీకర పోరు


'తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో 50 కి.మీ. పొడవు, 37 కి.మీ. వెడల్పు ఉన్న ఒక కొండపై మావోయిస్టులు ఏళ్ల తరబడి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అక్క డ సోలార్ విద్యుత్, ఐఈడీ (బాంబుల) తయారీ ఫ్యాక్టరీలు, ఐదేళ్లకు సరిపడా ఆహార ధాన్యాలు నిల్వ ఉంచుకున్నారు. 400 నుంచి 500 మంది కేడర్ అక్కడ ఉన్నారు. ఆ స్థావరాన్ని ఛేదించేందుకు కోబ్రా, సీఆర్పీఎఫ్, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా 21 రోజులపాటు ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ చేపట్టారు. 45 డిగ్రీల భగభగమండే ఎండలో మన జవాన్లు రోజుకు కేవలం 300 మిల్లీలీటర్ల నీటిని తాగుతూ ధైర్యంగా పోరాడారు. ఈ ఆపరేషన్‌లో 30 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. మిగిలిన వారు లొంగిపోయారు లేదా పారిపోతూ పోలీసులకు చిక్కారు. దీంతో బస్తర్, మహారాష్ట్ర, తెలంగాణలో మావోయిస్టుల ఉనికి తుడిచిపెట్టుకుపోయింది. అయితే, ఈ ఆపరేషన్ సమయంలో నక్సల్స్ పైకి (ఉత్తరం వైపు) రాకుండా అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరగా వారు నిరాకరించారు. కిందికి వస్తే మాత్రం ఆపుతామని చెప్పారు' అని అమిత్ షా పేర్కొన్నారు.

తెలంగాణలో తుడిచిపెట్టుకుపోయారు

2024 ప్రారంభంలో మావోయిస్టు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో 21 మంది సభ్యులు ఉండగా.. ఇప్పుడు వారు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారని అమిత్‌షా తెలిపారు. 'ఒకరు పట్టుబడ్డారు, ఏడుగురు లొంగిపోయారు, 12 మంది హతమయ్యారు, ఒకరు మాత్రమే పరారీలో ఉండి చర్చలకు మొగ్గుచూపుతున్నారు. అలాగే దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలోని 37 మందికిగాను ఎవరూ మిగల్లేదు. తెలంగాణ విషయానికి వస్తే, రాష్ట్ర కమిటీలో ఉన్న వారిలో ఆరుగురు లొంగిపోయారు, ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక్క నక్సలైట్ కూడా లేదు' అని చెప్పారు. బసవరాజు, హిడ్మా, వివేక్, పల్లూరి ప్రసాదరావు (చందన), వాసుదేవ్ వంటి అగ్రనేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోవడం లేదా లొంగిపోయారని తెలిపారు.

కాంగ్రెస్ దన్నుతోనే నక్సలిజం

'1970లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ 'అంతరాత్మ ప్రబోధానుసారం ఓటు వేయండి' అని పిలుపునిచ్చి, నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా మావోయిస్టుల మద్దతు తీసుకున్నారు. ఆ మద్దతును ఆసరాగా చేసుకుని మావోయిస్టులు దేశంలోని 17 శాతం భూభాగానికి, 10 శాతం జనాభాకు విస్తరించారు. తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేసుకున్నారు' అని అమిత్‌షా చెప్పారు. అలాగే నక్సల్స్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మ ప్రారంభించిన 'సల్వాజుడుం' ఉద్యమాన్ని 2011 జూలై 5న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం చట్టవిరుద్ధమని ప్రకటించిందని, ఆ తీర్పు వల్లే నిరాయుధులైన ఎంతోమంది



సల్వాజుడుం కార్యకర్తలను, ఆదివాసీలను నక్సల్స్ ఊచకోత కోశారని చెప్పారు.

ఆ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తినే విపక్షాలు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టాయని, ఇదీ కాంగ్రెస్‌కు నక్సల్‌స్‌తో ఉన్న లాలూచీ అని దుయ్యబట్టారు. 'రాహుల్ గాంధీ రాజకీయ జీవితంలో అనేకసార్లు నక్సల్స్ సానుభూతిపరులతో కనిపించారు. ఆయన జరిపిన భారత్ జోడో యాత్రలో నక్సల్స్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్లకు చెందిన వారు పాల్గొన్నారు. 2010లో ఒడిశాలో లాడో సికాకాతో, 2018లో హైదరాబాద్‌లో గద్దర్‌తో రాహుల్ వేదిక పంచుకున్నారు' అని అమిత్‌షా పేర్కొన్నారు. 1970 నుంచి 2026 మార్చి వరకు వామపక్ష తీవ్రవాదానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే ఉందని, నక్సల్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన 20 వేల మంది పౌరులు, జవాన్ల మరణాలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలన్నారు.

## దళిత క్రైస్తవులను ఎస్సీలు కాదనడం సరికాదు




**దేశంలోని క్రైస్తవ మత ప్రచారకులంతా అగ్రకులాల వారే ఉన్నారని, వారికి లేని నిబంధనలు ఎస్సీలకు మాత్రమే ఎందుకని ఆయన ప్రశ్నించారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో 'దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా' అనే అంశంపై ఆయన మాట్లాడారు. 'ఎస్సీల మతస్వేచ్ఛను హరించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం. కుల వివక్షను రూపుమాపడం చేతకానప్పుడు కుల వ్యవస్థనే రద్దు చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25లకు పూర్తి విరుద్ధం. క్రైస్తవంలోకి మారిన అగ్రకులాల వాళ్లు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు.. అదే పనిచేసిన దళితులు ఎస్సీ రిజర్వేషన్లు ఎందుకు పొందకూడదో చెప్పాలి. 1956లో సిక్కుదళితక్రైస్తవులకు, 1990లో బౌద్ధ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.**

## ఏపీలో గృహ ప్రవేశాల పండుగ

స్కూలు తదితర సదుపాయాలతో నిర్మించిన ఈ టిడ్కో భవనాలను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హైందవ సంప్రదాయ ప్రకారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం మరో ముస్లిం లబ్ధిదారు నివాసంలోనూ ప్రార్ధనలు నిర్వహించి నూతన గృహంలో అడుగుపెట్టారు. ఇంటి వెలుపల మహిళా లబ్ధిదారు పేరిట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును కూడా ముఖ్యమంత్రి స్వయంగా తగిలించారు. ప్రతీ ఇంటిపైనా పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈమేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ సంస్థతో రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మరికొందరు లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన స్వాధీన పత్రాలను ఇంటి తాళాలను అప్పగించారు. గతంలో పీఏవై కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను కూడా గత పాలకులు దుర్వినియోగం చేశారని సీఎం ఆక్షేపించారు. గత ప్రభుత్వం రూ.816 కోట్ల మేర అప్పు పెట్టిందని.. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు ప్రయత్నించిందన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించిందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు.

సంక్షేమంలో మార్చినెల కొత్త రికార్డులు

గడచిన 21 నెలల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని ..ఈ పరాభవ నామ సంవత్సరంలో రాష్ట్ర ఆదాయంవ్యయం ఎలా ఉన్నా... సంక్షేమానికి, అభివృద్ధికి మాత్రం లోటు లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్లకు ఇప్పటికి దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తల్లికి వందనం, దీపం 2, స్త్రీశక్తి సహా ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించామన్నారు. ఈ మార్చి నెల సంక్షేమంలో కొత్త రికార్డులు సృష్టించింది. వరాలను తెచ్చిందన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజు లక్ష మంది పారిశ్రామిక వేత్తలుగా ప్రకటించామని..ఈ ఏడాది 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని పెట్టుకున్నామని స్పష్టం చేశారు. రైతుకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులను విడుదల చేశామని.. 47 లక్షల మంది రైతులకు రూ. 2,676 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు. ఉగాది కానుకగా నిరుద్యోగ యువత కోసం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చామని అన్నారు. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌కు నెల్లూరు జిల్లాలో శంకుస్థాపన చేసుకున్నామని.. రక్షణ రంగంలో మన రాష్ట్రం కీలకం అవుతుందన్నారు. వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. 12.76 లక్షల మంది దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ఈ నెలలోనే కల్పించామని సీఎం తెలిపారు. ఉగాది రోజున 6,787 మంది పేదలకు రూ. 56 కోట్లను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదల చేశామన్నారు. రంజాన్ తోఫాగా ఇమామ్, మౌజన్లకు రూ. 45 కోట్ల గౌరవ వేతనాలు చెల్లించామని స్పష్టం చేశారు. పోలవరం నిర్వాసితులకు రూ.226 కోట్ల పునరావాస నిధులను విడుదల చేశామన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలకమైన ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని.. ఈ పరిశ్రమ ద్వారా రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, లక్ష ఉద్యోగాలు ఒకే ఒక్క పరిశ్రమతో మనకు దక్కాయన్నారు. గత ప్రభుత్వం చిన్న కాంట్రాక్టర్లకు నిలిపివేసిన రూ.2,000 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేసి 50 వేల కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువచ్చామని తెలిపారు. అంతకుమించి . 5 కోట్ల ప్రజల కలలు నెరవేర్చే ప్రజా రాజధానికి చట్టబద్ధత కల్పించమని కేంద్రాన్ని కోరుతూ శాసన సభలో తీర్మానం చేశామన్నారు.

2029 నాటికి 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మొత్తం 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. 201419లో 8.19 లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టి పేదలకు అప్పగించామని వివరించారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ అస్తవ్యస్తం చేశారని వాటన్నిటినీ గాడిలో పెడుతున్నామన్నారు. గత పాలకులు పేదవాళ్ల పొట్టకొట్టారని.. వారికి తీరని అన్యాయం చేశార్నని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 6.5 లక్షల ఇళ్లు మాత్రమే కడితే 21 నెలల్లోనే తాము 5.5 లక్షల ఇళ్లను కట్టి పేదవాళ్లకు అప్పగించామన్నారు. గత పాలకులు ప్రజావేదికతో




విధ్వంసాన్ని మొదలు పెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. రూ.10.50 లక్షల కోట్ల అప్పులు చేసి.. కేంద్రం ఇచ్చిన డబ్బులు కూడా మళ్లించారన్నారు. అవినీతి, అక్రమాలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీఎం ఆక్షేపించారు. ఇళ్ల కోసం లబ్ధిదారులు కట్టిన రూ.174 కోట్లను కూడా వాడేసుకున్నారని అన్నారు. 22 వేల మంది లబ్ధిదారులకు ఆ డబ్బులను తక్షణమే చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. 300 చదరపు అడుగుల ఇల్లు ఉచితమని, 350,400 చదరపు అడుగుల ఇళ్లు రాయితీపై ఇస్తామని ప్రగల్భాలు పలికి మోసం చేశారన్నారు. నివాస యోగ్యం కాని స్థలాలను ఇచ్చి ఇళ్లు కట్టించే ప్రయత్నం చేసి రూ.3,109 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని సీఎం వ్యాఖ్యానించారు. శ్మశానాల్లో, వాగుల్లో, బురద నేలల్లో స్థలాలు ఇచ్చి ఎవరికీ ఉపయోగపడకుండా చేశారన్నారు. ఈ పరిస్థితిని మారుస్తూ పేదలు మురికివాడలు కాకుండా పరిశుభ్రమైన ప్రాంతాల్లో ఉండాలన్న లక్ష్యంతో అన్ని సదుపాయాలతో ఇళ్లను నిర్మిస్తున్నట్టు వివరించారు. విశాఖలో ప్యాలస్ కట్టుకున్న వ్యక్తి పేదలకు ఇళ్లు కట్టడానికి మీనమేషాలు లెక్కించారన్నారు.

**ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు**

అందరికీ ఇళ్లు కార్యక్రమం కింద రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇళ్లస్థలాలు ఇస్తామని ముఖ్యమంత్రి వివరించారు. భవిష్యత్తులో ప్రతీ ఇంటికీ పైపు ద్వారా గ్యాస్ సరఫరా చేస్తామన్నారు. ఉచిత సిలెండర్ కు ఇచ్చే డబ్బులు ప్రతీ రెండు నెలలకూ వినియోగదారులకు చెల్లిస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని కూడా గత పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకం కొనసాగించేలా చేశామన్నారు.

2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన కూడా జరుగుతుందని.. మహిళలకూ చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే మహిళలకు టీడీపీ, ఎన్డీఏలు స్వాగతం పలుకుతాయన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతోనే అనునిత్యం పనిచేస్తున్నామని సీఎం వివరించారు. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు వచ్చేలా వ్యవస్థను గాడిలో పెట్టామన్నారు. పెన్షన్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పౌర సేవల అమలులో ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. పౌర సేవలు అందించటంలో చక్కగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నట్టు వివరించారు. సేవలు సరిగ్గా అందని చోట సరిచేసుకోవాలని సీఎం హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయాన్ని అనుసరించే పాలన మెరుగు పర్చుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఓటేసి కూటమికి అధికారం ఇచ్చారని.. కానీ ఒకాయన ప్రతిపక్ష హోదా ఇమ్మని అడుగుతున్నారని.. ఆ హోదా ఇచ్చేది ప్రజలే కానీ తాను కాదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు ప్రజలకు మేలు చేయాలని కానీ విధ్వంసం చేయకూడదన్నారు. అలాంటి వారిని దూరం పెట్టాల్సిన అవసరముందన్నారు. 2028 నాటికి తాను రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తి అవుతుందని.. ఎలాంటి ఆరోపణలూ లేని తనపై కేసులు పెట్టి జైల్లో వేశారని ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని సీఎం ప్రశ్నించారు. ఇంకా కొందరు సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా పోస్టులు పెట్టి ఆడబిడ్డలను రోడ్డుపైకి లాగుతున్నారని.. దీనిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యమంత్రి బాగా పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని గత పాలకుడు ఏపీని గంజాయికి, డ్రగ్స్ కు అడ్డాగా మార్చారన్నారు. కూటమి ప్రజాప్రభుత్వం అనునిత్యం రాష్ట్రంలో సంపద సృష్టికే ప్రయత్నిస్తోందన్నారు.

## త్వరలో ఒప్పందం కుదరకపోతే..

### సర్వనాశనమే: ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్



ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. ''ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ప్లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం'' అని హెచ్చరించారు.

ఇరాన్‌కు బలగాలను పంపబోం: బ్రిటన్ ప్రధాని

ఇరాన్‌కు తమ సైనిక బలగాలను పంపే అవకాశాలను బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తోసిపుచ్చారు. ''ఇది మా యుద్ధం కాదు. మేం అందులోకి అడుగుపెట్టబోం. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి మా వంతు ప్రయత్నాలు కొనసాగిస్తాం'' అని తెలిపారు. ఇరాన్‌పై దాడుల కోసం తన స్థావరాలను అమెరికా ఉపయోగించుకునేందుకు బ్రిటన్ ఇప్పటికే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడానికి యుద్ధ విమానాలను కూడా మోహరించింది.

## 340 కోట్ల రాయల్టీ ఎగ్గొట్టిన వారు..

# నీకు నీతిమంతులా ?

- పటాన్‌చెరు ఎమ్మెల్యే సోదరుడి అక్రమ మైనింగ్‌లో నీ వాటా ఎంతా?
- కబ్జాకోరులు, స్కామర్లకు మాజీ మంత్రి హరీశ్‌రావు వత్తాసు పలకడం సిగ్గుచేటు
- విలేకరుల సమావేశంలో ఫైర్ అయిన కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్
- దమ్ముంటే సీబీసీఐడీకి డిమాండ్ చేయాలని సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పటాన్ చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్

ఈకబురు, పటాన్ చెరు :

అక్రమ పద్ధతిలో మైనింగ్ చేస్తూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆధాయానికి గండి కొట్టిన దొంగలు నీకు నీతి మంతులుగా కనిపిస్తున్నారా అని మాజీ మంత్రి హరీశ్ రావుని పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ మైనింగ్ కేసులో ఇరికించి నెల రోజులు జైల్లో పెట్టిందని అసెంబ్లీలో హరీశ్ రావు మాట్లాడడం విడ్డూరంగా ఉందని, ప్రభుత్వానికి రూ. 340 కోట్ల రాయల్టీని ఎగ్గొట్టిన స్కామర్లకు మాజీ మంత్రి వత్తాసు పలకడం సిగ్గు చేటని మండిపడ్డారు. సోమవారం రామచంద్రాపురంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హరీశ్ రావు ప్రజాసమస్యలు, అభివృద్ధిపై మాట్లాడితే బాగుండేదని, దొంగలకు సద్ది కట్టినట్లు అక్రమ మైనింగ్ చేసి జైలుకు వెళ్లిన ఎమ్మెల్యే తమ్ముడి గురించి మాట్లాడడం బాధాకరమన్నారు. నిజంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డిలను టార్గెట్ చేస్తే వాళ్లు చేసిన పాపాలకు ఇంట్లో కంటే జైల్లోనే ఎక్కువ ఉంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే 2023 మార్చిలోనే వారి అక్రమ మైనింగ్‌కు పీసీబీ క్లోజర్ ఆర్డర్ ఇచ్చిందని, వేల కోట్ల అక్రమార్జనకు సహకరించిన హరీశ్ రావుకి ఈ విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి మాటలు విని ఎమ్మెల్యే సోదరుల అక్రమ వ్యాపారంలో హరీశ్ రావుకు వాటా ఉందనే అనుమానం వ్యక్తమవుతుందన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ మైనింగ్ విషయంపై సీబీసీఐడీ విచారణకు హరీశ్ రావు డిమాండ్ చేయాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరులు పటాన్‌చెరులో మిగులు భూములన్నీ మాయం చేసి వేల కోట్లు దండుకున్నారని, వాటిపై ఆధారాలతో సహా విచారణకు తాము సిద్ధమని పేర్కొన్నారు. పోచారం సర్వే నంబర్ 62 లో వంద కోట్ల భూ కుంభకోణం జరిగిందని, ఎమ్మెల్యే అల్లుడు పాటి ఆనంద్ నగర్‌లో చేసిన 32 ఎకరాల స్కామ్ పై కాంగ్రెస్ ఫిర్యాదుతో ఇటీవల హైడ్రా చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సోదరుడు వద్ద అధికారులకు లక్ష గజాల ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్ దొరికిందని, లక్ష గజాల ప్లాట్ ఈ ప్రపంచంలోనే ఉండదని అలాంటి అక్రమాలు వీరికే సాధ్యమని ఎద్దేవా చేశారు. వేల కోట్ల స్కాంలు చేసి అక్రమంగా ప్రజలను దోచిని వారికి సపోర్ట్ చేస్తున్న వారు ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. మీ భాగస్వామ్యంతోనే వాళ్లు ఇన్ని అక్రమాలు చేశారనే ప్రజల అనుమానాలను నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎమ్మెల్యే సోదరుల అక్రమాలపై తమ పోరాటం ఆగదని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవో 317 బాధితులకు న్యాయం చేయండి



ఈ కబురు,హైదరాబాద్ :

జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాలు, జోన్ లలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాలు, జోన్ లలో పోస్టింగ్స్ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగుల సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారని గుర్తు చేశారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాలు, జోన్ ల వారీగా సర్దుబాటు చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జీవో నంబర్ 317 జారీ చేసిందని తెలిపారు. కానీ ఆ జీవోలోనూ స్థానికతపై స్పష్టత లేకపోవడంతో వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జీవో 317తో ఉద్యోగులు, టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అప్పటి సీఎం కేసీఆర్ కు పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు లేఖ రాశారని గుర్తు చేశారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపిస్తే జీవో 317ను సమీక్షించి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. జీవో 317 బాధితుల సమస్యకు పరిష్కారం చూపిస్తామంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారని, కానీ ఇప్పటి వరకు ఆ నివేదిక ప్రభుత్వం బయట పెట్టలేదన్నారు. ఆ నివేదిక వెలుగులోకి వస్తే తప్ప జీవో 317 బాధితులు ఎంత మంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదన్నారు. జీవో 317 బాధితులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని అసెంబ్లీ సాక్షిగా మీ మంత్రి ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదన్నారు. ఇప్పటి వరకు ఈ అంశంపై కేంద్రానికి కనీసం లేఖ కూడా రాయలేదంటే ఉద్యోగుల సమస్యలంటే మీకు ఎంతటి పట్టింపులేనితనం ఉందో స్పష్టమవుతుందన్నారు. వెంటనే జీవో 317 బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

--స్థానికత నిబంధనల మార్పుతో మన మట్టిబిడ్డలకు అన్యాయం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికతను గుర్తించే నిబంధనల్లో మార్పులు చేసి ఈ మట్టి బిడ్డలకు తీరని అన్యాయం చేశారని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు తెలంగాణలో చదివిన వారిని స్థానికులుగా గుర్తిస్తామనే నిబంధన కారణంగా ఇంటర్మీడియెట్ చదివేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న ఈ ప్రాంత బిడ్డలు స్థానికేతరులు అయిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే హైదరాబాద్ సమీప ప్రాంతాలకు వచ్చి ఇక్కడ ఇంటర్మీడియెట్ వరకు చదివే వాళ్లు స్థానికులు అయి మన వాళ్లకు దక్కాల్సిన అవకాశాలు కొల్లగొడుతున్నారని తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్ల పాటు ఏ రాష్ట్రం, జిల్లాలో చదివితే అక్కడి స్థానికులుగా గుర్తించే పాత ఉత్తర్వులను మళ్లీ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

**––ఆడబిడ్డలకు శానిటరీ ప్యాడ్స్ అందించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లు, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు కనీసం శానిటరీ ప్యాడ్స్ అందించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈమేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'ఎక్స్'లో సోమవారం పోస్ట్ పెట్టారు. 'పీఎం శ్రీ' పథకం కింద ఇతర స్కూళ్లలో ఇస్తున్నట్టే ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి నెలా విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు.

# ఎంఐజీ రామాలయాన్ని సందర్శించిన టీటీడీ చైర్మన్ నాయుడు



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఆలయ కమిటీ, కాలనీ వాసులతో బీఆర్ నాయుడు దంపతులు

**ఈ–కబురు, పటాన్‌చెరు :**

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ రామాలయాన్ని సందర్శించారు. ఆలయంలో త్వరలో ప్రతిష్ఠించనున్న 27 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎల్‌ఐజీ కాలనీలోని పోచమ్మ దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు బీఆర్ నాయుడు దంపతులకు సాధర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, అందుకే ధార్మిక కార్యక్రమాలకు, దేవాలయాల నిర్మాణాలకు తనవంతు సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని అన్నారు. తెలంగాణలోని కరీంనగర్‌లో రూ. 75 కోట్లతో, కొడంగల్‌లో 114 కోట్లతో ఆలయాలు నిర్మించబోతున్నట్లు వివరించారు. ఖమ్మం, సిద్ధిపేట, దుబ్బాక, మంథని తదితర ప్రాంతాల్లో ఆలయాలతో పాటు ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్‌ఐజీ కాలనీతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, ఇక్కడ నివసించే సమయంలో పోచమ్మ గుడి ముందుగా నడుచుకుంటూ వెళ్లే వాడినని ఈ ఈ సందర్భంగా బీఆర్ నాయుడు అలనాటి స్మృతులను కాలనీ వాసులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గురజాల శ్రీనివాస్, యాదగిరి రెడ్డి, సత్యనారాయణ, యాదయ్య గౌడ్, మురళీకృష్ణ, చెన్నకేశవ రావు, సీవీఎస్ కుమార్, రమేశ్, ఉమామహేశ్వర రావు, నందారెడ్డి, సంజీవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గోపినగర్‌లో ఉత్సాహంగా

# జిల్లా స్థాయి కుస్తీ పోటీలు



కుస్తీలో పోటీ పడుతున్న క్రీడాకారులు



విజేతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

### రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 18 మంది ఎంపిక

ఈకబురు, శేరిలింగంపల్లి : రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా స్థాయి అండర్ 20 పురుషులు, మహిళల కుస్తీ పోటీలు ఘనంగా జరిగాయి. తుల్జాభవాని వ్యాయామశాల ఆధ్వర్యంలో గోపినగర్ ప్రధాన కూడలిలో సోమవారం జరిగిన ఈ పోటీలలో జిల్లాలోని వివిధ వ్యాయామశాలల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీ స్టైల్ వివిధ కేజీల విభాగంలో అభినయ్, శ్రీధర్, భరత్ బాబు, నాగేందర్, ఉమేష్, పియూష్ సింగ్, అభిషేక్, జయ కిషన్ యాదవ్, సోమనాథ్ రెడ్డి, మహిళలు అపూర్వ, లక్ష్మి, శ్రీనిధి, రోమన్ గ్రీక్ స్టైల్ విభాగంలో వివిధ కేజీల పోటీల్లో శివకుమార్, ప్రణవ్ కుమార్, సాంబా ధనుంజయ్, సందీప్ చరణ్, సంపత్ కుమార్, దీప్ సింగ్, రవి కిరణ్, అభిరామ్ రెడ్డిలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మీరందరూ ఏప్రిల్ 2వ తేదీ కామారెడ్డి లో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న పిసిసి ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజి కౌన్సిలర్ దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, మూల వెంకటేష్ గౌడ్, దుర్గం వీరేశం గౌడ్, విజయ్ కుమార్ రెడ్డి, కాటా నరసింహ గౌడ్, కొమరగాని వెంకటేష్ గౌడ్, పుట్ట వినయ కుమార్ గౌడ్, బెజగం కేశవులు, లీలానంద్ గౌడ్, గోపాల్ యాదవ్, కలివేముల వీరేశం గౌడ్, పుట్ట శ్రీకాంత్ గౌడ్, గఫూర్, పవన్ గౌడ్, నర్సింహా తదితరులు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కుస్తీ అంటే భారతీయ ప్రాచీన మల్ల యుద్ధానికి ప్రతీక అని, ఒలంపిక్స్ లోను ప్రాధాన్యతను సంతరించుకున్నదని అన్నారు. అలాంటి కుస్తీ వైపు యువత అడుగులు వేయడం అభినందనీయమని అన్నారు. లింగంపల్లిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించిన తుల్జా భవాని వ్యాయామశాల నిర్వాహకులు లచ్చుమొల్ల పాండు గౌడ్, వారి కుమారులు అరవింద్ గౌడ్, మోహన్ గౌడ్, రోషన్ గౌడ్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కే.యాదయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పాండు, ఉపాధ్యక్షులు హీరలాల్, కార్యదర్శి భగవాన్ సింగ్, కుస్తీ ప్రముఖులు రాజు, శ్రీధర్, రాజ్ కుమార్, సుధాకర్, రమ్య, శ్రీనివాస్, విశ్వంభర్ సింగ్, నవీన్, ప్రకాష్‌సింగ్ బస్తీవాసులు సంఖ్యలో పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిలో నాన్ టీచింగ్ ఉద్యోగుల పాత్ర ఎనలేనిది : పల్లపు సురేందర్



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న సురేందర్ తదితరులు

ఈకబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అభివృద్ధిలో నాన్ టీచింగ్ ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని కాంగ్రెస్ పార్టీ నల్లగండ్ల డివిజన్ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరిపాటి జైపాల్ తో కలిసి పల్లపు సురేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు సురేందర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పదవీకాలంలో ఉత్తమంగా సేవలు అందించిన నాన్ టీచింగ్ ఉద్యోగుల కృషిని అభినందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నేడు ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకోవడంలో నాన్ టీచింగ్ ఉద్యోగుల కృషి ఎనలేనిదని గుర్తు చేశారు. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు భవిష్యత్తులోనూ విద్యారంగానికి తమ సేవలు అందించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, విశ్వవిద్యాలయ సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.




నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిసి జైపాల్, సురేందర్



## ఎల్పీజీ సరఫరా పెంపునకు కేంద్రానికి లేఖ రాస్తాం

నౌక రాకల ఆలస్యంతోనే ఎల్పీజీ కొరత నెలకొందన్నారు. ఈ సమస్యపై ప్రధాన ఎల్పీజీ సరఫరాదారులతో సోమవారం సచివాలయంలో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ కలెక్టర్ హరిచందనతోపాటు ఐఓసీఎల్, గోగ్యాస్, టోటల్ ఎనర్జీలతోపాటు సూపర్ గ్యాస్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. గ్యాస్ కొరత నివారణకు ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు సరఫరాను పెంచాలని కోరారు. 'ఆటోలకు రోజువారీగా 202 టన్నుల గ్యాస్ అవసరమైతే.. అంతర్జాతీయ సంక్షోభంతో రోజుకు 147 టన్నులే అందుబాటులో ఉంటోంది. ఆటో ఎల్పీజీ సరఫరాలో 75% వాటా ప్రైవేటు సంస్థలదే ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు మెరుగైన సరఫరా చేస్తున్నాయి. ఐఓసీఎల్ మాత్రమే రోజూ 35 టన్నులు సరఫరా చేస్తోంది. హైదరాబాద్‌లో 116, ఓఆర్ఆర్ లోపల, వెలుపల 27తో కలిపి మొత్తం 143 ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉంటే.. అందులో 23 పనిచేయడం లేదు. ప్రైవేటు సంస్థలు కృష్ణపట్నం, మహారాష్ట్రలోని జైగఢ్, ముంబయిలతోపాటు తమిళనాడులోని టర్మినళ్ల నుంచి బల్క్ ఎల్పీజీని సేకరిస్తున్నాయి' అని ఉత్తమ్ తెలిపారు.



# నష్టయాతన

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆఖరి ట్రేడింగ్ రోజును భారీ నష్టాలతో సూచీలు ముగించాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు అయిదో వారంలోకి అడుగుపెట్టడం, చమురు ధర మరింత పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంకా క్షీణించడం ఇందుకు నేపథ్యం. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడమూ ప్రభావం చూపింది. డాలరు విలువ తొలిసారి రూ.95 స్థాయిని తాకింది. సోమవారం ఒక దశలో రూ.95.22కు చేరినా, చివరకు 94.70 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1% తగ్గి 112 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 72,565 వద్ద భారీ నష్టాల్లోనే (క్రితం ముగింపు 73,583.22) ఆరంభమైంది. ఆ తర్వాత 71,774.13 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 1635.67 పాయింట్ల నష్టంతో 71,947.55 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 488.20 పాయింట్లు కోల్పోయి 22,331.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 22,283.85 వద్ద కనిష్ఠాన్ని; 22,714.10 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. సెన్సెక్స్ 30 కంపెనీల్లో పవర్‌గ్రిడ్ మినహా మిగతావాన్నీ నష్టాల్లో ముగిశాయి. సోమవారం రూ.9.74 లక్షల కోట్ల నష్టం: మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ సోమవారం రూ.9.74 లక్షల కోట్లు తగ్గి రూ.412.41 లక్షల కోట్ల (4.36 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. గత రెండు ట్రేడింగ్ సెషన్స్‌లో రూ.18.60 లక్షల కోట్ల సంపద ఆవిరవ్వడం గమనార్హం. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ 2025 డిసెంబరు చివరికి 5.3 లక్షల కోట్ల డాలర్ల వద్ద ఉండగా.. మూడు నెలల్లో 4.36 లక్షల కోట్ల డాలర్లకు దిగివచ్చింది. మార్చిలో విదేశీ సంస్థాగత మదుపర్లు భారత స్టాక్ మార్కెట్ నుంచి 12 బిలియన్ డాలర్ల (రూ.1,14,000 కోట్ల) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

ఆ ఏడు కంపెనీలకు రూ.3,28,702 కోట్ల నష్టం

నిఫ్టీ 50 సూచీలో అధిక వాటా కలిగిన 7 కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, ఎల్అండ్‌టీ షేర్లకు గత రెండు రోజుల్లో నష్టాల వల్ల, మొత్తంగా వీటి మార్కెట్ విలువ రూ.3,28,702 కోట్ల మేర తగ్గింది.

అంతర్జాతీయంగా మార్కెట్ విలువలో 3% దిగువకు భారత్ వాటా

అంతర్జాతీయంగా నమోదిత కంపెనీల మార్కెట్ విలువపరంగా భారత్ వాటా 3% దిగువకు వచ్చింది. గత నాలుగేళ్లలో ఈ స్థాయికి పడిపోవడం ఇప్పుడే. 2026 మార్చి 30 నాటికి, అంతర్జాతీయ విలువలో భారత్ వాటా 2.97 శాతంగా నమోదైంది. 2024 జులైలో 4.57% వద్ద గరిష్ఠ స్థాయిని చేరాక, అక్కడ నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2024 డిసెంబరులో 4.2% వద్ద ఉన్న భారత్ వాటా 2025 డిసెంబరులో 3.5 శాతానికి దిగివచ్చింది. 2026 ప్రారంభంతో పోలిస్తే అంతర్జాతీయంగా మార్కెట్ విలువలో చైనా వాటా 8.9% నుంచి 9.5 శాతానికి; జపాన్ వాటా 5.1% నుంచి 5.4 శాతానికి; హాంకాంగ్ వాటా 4.8% నుంచి 5 శాతానికి; తైవాన్ వాటా 2.2% నుంచి 2.6 శాతానికి పెరిగాయి. అమెరికా వాటా 48% నుంచి 46 శాతానికి తగ్గింది.

రూపాయికి 14 ఏళ్లలోనే భారీ క్షీణత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ దాదాపు 10% క్షీణించింది. గత 14 ఏళ్లలోనే ఇదే అత్యధిక క్షీణత. 201112లో 12.4% క్షీణత తరవాత ఇంతగా తగ్గడం, ఈ ఆర్థిక సంవత్సరంలోనే. 202526లో భారత కరెన్సీనే కాకుండా ఇతర ఆసియా కరెన్సీలు కూడా డాలరుతో పోలిస్తే భారీగా క్షీణించాయి. జపాన్ యెన్ 6%, ఫిలిప్పిన్ పెసో 5.74%, దక్షిణ కొరియా వన్ 2.88% తగ్గాయి.

సీఎంపీడీఐఎల్ పేలవ ఆరంభం..

కోల్ ఇండియా అనుబంధ సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్ (సీఎంపీడీఐఎల్) షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రోజే పేలవ ప్రదర్శన కనబర్చాయి. ఇష్యూ ధర రూ.172తో పోలిస్తే 7% తక్కువగా రూ. 162.80 వద్ద సోమవారం ఈ కంపెనీ షేరు బీఎస్ఈలో నమోదైంది. చివరకు 10.44% నష్టంతో రూ.154.05 వద్ద ముగిసింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.10,999.17 కోట్లుగా నమోదైంది.

## ఈసీఎంఎస్ పథకం కింద రూ.7,104 కోట్ల ప్రతిపాదనలు



దిల్లీ: డిజైన్ సామర్థ్యాలను పెంపొందించడం, సిక్స్ సిగ్మా నాణ్యాతా ప్రమాణాలను సాధించడం, కార్మికుల నైపుణ్యాలను మెరుగుపర్చడంపై కేంద్రం కోరిన స్పష్టమైన ప్రణాళికపై త్వరితగతిన స్పందించాలని, లేకపోతే ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మానుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్) కింద నిధుల విడుదల, కొత్త ఆమోదాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ పరిశ్రమకు స్పష్టం చేశారు. ఈసీఎంఎస్ కింద రూ.7,104 కోట్ల తాజా పెట్టుబడితో కూడిన 29 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన అనంతరం, ప్రోడక్ట్ డిజైన్‌లో పెట్టుబడి పెట్టని లబ్ధిదారులను తొలగించే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. పరిశ్రమ తగిన చర్యలు తీసుకోకపోతే, తదుపరి చెల్లింపులు లేదా ఆమోదాలను నిలిపివేయడానికి సిద్ధంగా ఉన్నానని వైష్ణవ్ తెలిపారు. అధిక నాణ్యత, స్వయం సమృద్ధి గల ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సమీకృత విధానాన్ని పాటించనందుకు, ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ), దాని సభ్య సంస్థలను మంత్రి మందలించారు. 'మీరు ఏ విధంగా సంఘటితమై ఉన్నా సరే, ఒక సరైన వ్యవస్థీకృత కార్యక్రమంతో ముందుకు రావాలని పరిశ్రమను అభ్యర్థిస్తున్నాను. ఎందుకంటే గత సమావేశంలో మార్చి నెలాఖరులోగా ఒక వ్యవస్థీకృత కార్యక్రమాన్ని రూపొందిస్తామని పరిశ్రమ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు నాకు అది కనిపించడం లేద'ని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం సకాలంలో అనుమతులు ఇప్పించిందని, ఇప్పుడు పరిశ్రమ ముందుకు రావాలని అన్నారు. ప్రభుత్వం తన వంతు కృషి చేస్తున్నందున, పరిశ్రమల నిర్వాహకులు కూడా సమాన ప్రయత్నాలు చేయాలని మంత్రి తెలిపారు.

# డాలరు ధాటికి రూపీ విలవిల

**భారత కరెన్సీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూపాయి విలువ భారీ పతనానికి గురైంది. సోమవారం (మార్చి 30, 2026) నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 95.45 స్థాయికి పడిపోయింది. ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ ఈ అసాధారణ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపేలా కనిపిస్తోంది. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల మంట దీనికి ప్రధాన కారణాలుగా ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.**



పతనానికి ప్రధాన కారణాలు

ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం

పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య చెలరేగిన యుద్ధం ప్రపంచ ఇంధన సరఫరా గొలుసును దెబ్బతీసింది. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా రాకపోకలు నిలిచిపోవడంతో మార్కెట్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఇది డాలర్‌కు విపరీతమైన డిమాండ్‌ను పెంచి, రూపాయిని బలహీనపరిచింది.

చమురు ధరలు

భారతదేశం తన చమురు అవసరాల్లో 80% పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర ఇటీవల బ్యారెల్‌కు 115 డాలర్ల మార్కు వరకు వెళ్లడంతో చమురు దిగుమతి బిల్లు భారీగా పెరిగింది. చమురు కంపెనీలు డాలర్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండటంతో రూపాయిపై ఒత్తిడి తీవ్రమైంది.

**ఎల్‌పీజీ దిగుమతులు**

కేవలం పెట్రోల్, డీజిల్ మాత్రమే కాకుండా వంటగ్యాస్(ఎల్‌పీజీ) దిగుమతులపై కూడా యుద్ధ ప్రభావం పడింది. సరఫరాలో అంతరాయాలు కలగవచ్చనే భయంతో ముందస్తుగా నిల్వలను పెంచుకోవడానికి కంపెనీలు చేస్తున్న కొనుగోళ్లు కరెన్సీ విలువను మరింత తగ్గించాయి.

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ

ఒక్క మార్చి నెలలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సుమారు 13.5 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించి భారత మార్కెట్ల నుంచి నిష్క్రమించారు. 2020 నాటి కోవిడ్ పరిస్థితుల తర్వాత ఈ స్థాయిలో పెట్టుబడులు వెనక్కి వెళ్లడం ఇదే మొదటిసారి.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

రూపాయి బలహీనపడటంతో దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు (ఎలక్ట్రానిక్స్, ఎరువులు, వంట నూనెలు) పెరిగి సామాన్యుడిపై భారం పడనుంది. పెరిగిన చమురు బిల్లుల కారణంగా దేశ కరెంట్ ఖాతా లోటు భారీగా విస్తరించే అవకాశం ఉంది. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు, విదేశీ ప్రయాణాలకు వెళ్లే వారికి ఖర్చు భారీగా పెరుగుతుంది.

ఆర్‌బీఐ చర్యలు

రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగింది. బ్యాంకుల ఫారెక్స్ పొజిషన్లపై కఠినమైన పరిమితులు విధించడంతో పాటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి డాలర్లను విక్రయించడం ద్వారా లిక్విడిటీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేస్తోంది. అయితే, యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే అత్యవసర డిపాజిట్ పథకాలను పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయ స్థిరత్వం ఏర్పడే వరకు రూపాయిపై ఈ ఒత్తిడి కొనసాగేలా కనిపిస్తోంది. యుద్ధం చల్లారకపోతే రూపాయి విలువ మరింత క్షీణించే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# ఏటీఎం వినియోగంపై పరిమితులు

హైదరాబాద్: కొత్త ఆర్థిక సంవత్సరం (202627) బుధవారం నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ నిబంధనల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)తో పాటు, పలు బ్యాంకులు తమ ఖాతాదారుల లావాదేవీల నియమాలను సవరిస్తున్నాయి.

యూపీఐతో తీసుకున్నా: ఇప్పటివరకూ ఏటీఎంలలో కార్డు లేకుండా, యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు ఉపసంహరించుకునే వెసులుబాటును వినియోగదారులు ఉచితంగా లేదా అదనపు లావాదేవీగా వాడుకునే వారు. ఏప్రిల్ 1 నుంచి దీనికి అడ్డుకట్ట పడనుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్యాంకులు ఇకపై ఏటీఎంలలో చేసే యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలనూ, నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీలుగానే పరిగణించనున్నాయి. ఉచిత లావాదేవీల పరిమితి ముగిశాక.. యూపీఐ ద్వారా చేసే ప్రతి ఉపసంహరణపైనా రూ.23తో పాటు అదనంగా పన్నులు చెల్లించాల్సిందే.

ఉపసంహరించే మొత్తం తగ్గింపు

ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై రోజువారీ ఏటీఎం నగదు ఉపసంహరణ పరిమితులను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సగానికి తగ్గించింది. చాలా కార్డులకు రోజువారీ పరిమితిని రూ.1,00,000 నుంచి రూ.50,000 చేసింది.

బంధన్ బ్యాంక్ ఖాతాదారులు తమ సొంత ఏటీఎంలలో నెలకు 5 సార్లు ఉచిత ఆర్థిక లావాదేవీలు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎంలను వాడితే మెట్రో నగరాల్లో 3 లావాదేవీలు మాత్రమే ఉచితం. పరిమితి దాటితే, ప్రతి లావాదేవీకి రూ.10 రుసుము పడుతుంది.



రెండంచెల్లో..: ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు డిజిటల్ చెల్లింపులకు కేవలం ఓటీపీ మాత్రమే కాకుండా పిన్ లేదా బయోమెట్రిక్ వంటి అదనపు ధ్రువీకరణ (రెండంచెల భద్రత) తప్పనిసరి కానుంది. యాప్‌ల ద్వారా పదేపదే బ్యాలెన్స్ తనిఖీ చేస్తే నామమాత్రపు ఛార్జీలుంటాయి.

### ఆర్థిక మూలాలు బాగున్నాయ్.. రూపాయికి ఇబ్బంది లేదు

దిల్లీ: మన దేశ ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలతో చూస్తే, డాలర్‌తో పోలిస్తే రూపాయి 'బాగుంది' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం వెల్లడించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాక, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 4.1% తగ్గి 94.70కు చేరింది. రూపాయి క్షీణతపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. మన ఆర్థిక పరిస్థితి పటిష్ఠంగా ఉంది. మన ద్రవ్యలోటు నిర్వహణను ప్రపంచమంతా కొనియాడుతోంది. మన విదేశీ మారకపు నిల్వలు బలంగా ఉన్నాయి. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే రూపాయి పరిస్థితి చాలా బాగుంది' అని పేర్కొన్నారు. కరెన్సీ క్షీణత మన దేశానికి మాత్రమే పరిమితం కాలేదని, పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమయ్యాక, ప్రధాన ఆసియా కరెన్సీలు క్షీణించాయని నిర్మల వెల్లడించారు. దక్షిణకొరియా వోన్, థాయ్ బాట్, ఫిలిప్పీన్ పెసో వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే రూపాయి కంటే ఎక్కువగా వరుసగా 4.6%, 5.5%, 4.8% పడిపోయాయన్నారు.

దివాలా స్మృతి సవరణకు లోక్‌సభ ఆమోదం: కఠినమైన కాలపరిమితులు, కోర్టు వెలుపల పరిష్కారం, క్రాస్ బోర్డర్ దివాలా ప్రక్రియల కోసం దివాలా స్మృతి సవరణ బిల్లును లోక్‌సభ సోమవారం ఆమోదించింది. 2016లో అమల్లోకి వచ్చిన దివాలా స్మృతి (ఐబీసీ)లో 12 సవరణలు చేశామని, వాటాదార్లకు మంచి విలువ అందించడంతో పాటు పాలనా ప్రక్రియను మెరుగుపరచడంలో ఇవి తోడ్పడతాయని నిర్మలా సీతారామన్ వెల్లడించారు

# ఎరువుల ప్లాంట్లకు సరఫరా చేసే గ్యాస్ ధర 60% పెరిగింది

దిల్లీ: పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రతరం కావడంతో, ఎరువుల ప్లాంట్లకు అవసరమైన ముడి సహజ వాయువు ధరలు 60% పెరిగాయి. ఫలితంగా ఎరువుల కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ మొత్తం పెరగాల్సి వస్తుంది. యుద్ధం కారణంగా ఇంధన సరఫరా మార్గాలకు అంతరాయం కలగడంతో, నత్రజని ఆధారిత ఎరువులకు మూలమైన అమ్మోనియా ఉత్పత్తికి ప్రధాన ముడి పదార్థమైన సహజ వాయువు సరఫరా, గిరాకీలో 80 శాతానికి పరిమితమైంది. లోటును భర్తీ చేయడానికి, ఎరువుల కంపెనీలు స్పాట్ లేదా కరెంట్ మార్కెట్ నుంచి ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) కొనుగోలు చేస్తున్నాయి. పశ్చిమాసియా పరిణామాలపై జరిగిన అంతర్‌మంత్రిత్వ శాఖల సమావేశంలో, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి అపర్ణా ఎస్.శర్మ మాట్లాడుతూ.. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినన్ని ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితి క్లిష్టంగా ఉన్నా, వ్యూహాత్మకంగా దాన్ని ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. ఎల్ఎన్‌జీ, అమ్మోనియా, సల్ఫర్ వంటి ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా ఖర్చులు అధికమయ్యాయని తెలిపారు.

2026 ఖరీఫ్‌లో 39 మి.టన్నుల ఎరువులు అవసరం: గత ఏడాది 36.1 మిలియన్ టన్నుల ఎరువులు వినియోగం అవ్వగా.. 2026 ఖరీఫ్‌కు మొత్తం ఎరువుల అవసరం సుమారు 39 మి.టన్నులుగా అంచనా వేశారు. ప్రస్తుత నిల్వలు సుమారు 18 మి.టన్నులుగా ఉన్నాయి. ఇది గత ఏడాది ఇదే కాలంలోని 14.7 మి.టన్నుల కంటే ఎక్కువ. సాధారణంగా వ్యవసాయ అవసరాలు తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలలను 'ఎరువుల బఫర్ స్టాపెంచుకోవడానికి వినియోగిస్తున్నట్లు అపర్ణ తెలిపారు.



## సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి కాంబినేషన్ ఫిక్స్



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో (Salman Khan) వంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి (Maatrubhumi: May War Rest in Peace)'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ (Vamshi Paidpally) సినిమాను కూడా మొదలుపెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.



## 'పెద్ది' మరోసారి వాయిదా..? నిర్మాత మాటతో చర్చ

రామ్‌చరణ్ (Ram Charan) హీరోగా నటిస్తున్న 'పెద్ది' (Peddi) సినిమా జూన్ 26కు (Peddi Postponed) వాయిదా పడినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. నిర్మాత ఎస్కేఎన్ మాటతో దానికి బలం చేకూరినట్లైంది. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''జూన్ 26న మా 'చెన్నై లవ్‌స్టోరీ' సినిమాని విడుదల చేయాలనుకున్నాం. కానీ, ఆ తేదీన 'పెద్ది' రిలీజ్ ఉందని సాయి రాజేశ్ చెప్పారు. అందుకే మా మూవీ రిలీజ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అని అన్నారు. దీంతో, 'పెద్ది' రిలీజ్‌పై మళ్లీ చర్చ జరుగుతుండగా.. ఎస్కేఎన్ స్పందించారు. తాను పొర పడినట్లు చెప్పారు. ''చెన్నై లవ్‌స్టోరీ'ని ఎప్పుడు విడుదల చేద్దాం' అని సాయి రాజేశ్‌ని అడిగితే.. 'పెద్దిని జూన్ 26న విడుదల చేస్తున్నట్లు ట్వీట్లు కనిపిస్తున్నాయి. అందుకే ఆ మేకర్స్ అనౌన్స్ చేసే వరకు నువ్వు మన సినిమా రిలీజ్ డేట్ ప్రకటించకు'' అని అన్నారు. వేడుక సందడిలో నేను పొరపడి పెద్ది రిలీజ్ ఫిక్స్ చేసేశారేమో అనుకుని.. ఆ డేట్‌కి 'చెన్నై లవ్‌స్టోరీ' రాదని చెప్పా. కానీ, వేదిక పైనుంచి కిందికి వచ్చాక అసలు విషయం తెలిసింది. పెద్ది సినిమా వాయిదా గురించి నేను మాట్లాడటాన్ని తప్పుగా తీసుకోవద్దు'' అని పేర్కొన్నారు. వాయిదా రూమర్లపై 'పెద్ది' చిత్ర బృందం స్పందించలేదు. మార్చిలోనే రావాల్సిన ఈ సినిమా ఏప్రిల్ 30కు వాయిదా పడిన సంగతి తెలిసిందే.

'లెనిన్' పరిస్థితేంటి?

ఏప్రిల్ 30న 'పెద్ది' వస్తుందన్న ఉద్దేశంతో.. అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కుతున్న 'లెనిన్' (Lenin) చిత్రాన్ని మేకర్స్ జూన్ 26కు వాయిదా వేశారు. 'పెద్ది' వాయిదా ప్రచారం నేపథ్యంలో.. 'లెనిన్' ముందు అనుకున్న డేట్ (మే 1) వస్తుందా? అన్న దానిపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒకవేళ అఖిల్ మూవీ మే 1న రాకపోతే ఏప్రిల్ 30/మే 1న పలు చిన్న చిత్రాలు విడుదలయ్యే అవకాశాలున్నాయి. 'పెద్ది'ని దృష్టిలో పెట్టుకుని షరతులు వర్తిస్తాయి అంటూ 'గాయపడ్డ సింహం' చిత్ర బృందం ఇప్పటికే విడుదల తేదీ వివరాలను వినూత్నంగా ప్రకటించింది. మే 1న 'గాయపడ్డ సింహం' విడుదలవుతుందని, ఒకవేళ ఏప్రిల్ 30న 'పెద్ది' వస్తే వారం ఆలస్యంగా రిలీజ్ చేస్తామని వెల్లడించింది.

డబ్బింగ్ చిత్రాలొస్తున్నాయ్

ఏప్రిల్ 30న డబ్బింగ్ సినిమాలూ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ధనుష్ హీరోగా నటించిన తమిళ సినిమా 'కర', ఓ పాట వివాదంతో ఇటీవల వార్తల్లో నిలిచిన కన్నడ చిత్రం 'కేడీ: ది డెవిల్' అదే తేదీన విడుదల కానున్నాయి.

## తల్లినయ్యాక ఆడపులిలా మారాను: కియారా

అమ్మనయ్యాక తను జీవితాన్ని చూసే విధానమే మారిపోయిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ. హీరోలకు దీటుగా యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టే నాయికీమె. ప్రస్తుతం మాతృత్వ దశను ఆస్వాదిస్తున్న కియారా.. తల్లయిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. "ఇప్పుడు నేను ఆడపులిలా మారానని అనిపిస్తోంది. మునుపటి కంటే నా జీవితాన్ని చూసే కోణం భిన్నంగా ఉంది. ఒక్కోసారి మరేదీ ముఖ్యం కానట్టు అనిపిస్తుంది. కొన్ని సమయాల్లో ప్రతి చిన్న విషయం కూడా ముఖ్యమనే భావన కలుగుతుంది" అని అంది.

పెళ్లి తర్వాత తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో తన బంధం గురించి మాట్లాడుతూ.. "పెళ్లికి ముందు మా మధ్య ఉన్న సరదా కబుర్లు, కలిసి ప్రయాణాలు చేయడం ఇవేమీ మారలేదు. ఇప్పటికీ మేమిద్దరం కలిసి సినిమాలు చూస్తాం. నటీనటులుగా, సినిమా ప్రేమికులుగా ఆ చిత్రాల గురించి చర్చించుకోవడం మాకు చాలా ఇష్టమ"ని చెప్పుకొచ్చింది.

"నాకు ఎప్పుడూ నటిని అవ్వాలని ఉండేది. చిన్నప్పుడే నాలో ఆ కోరిక ఉందని మా తల్లిదండ్రులు పసిగట్టారు. కానీ ముందుగా చదువు పూర్తి చేయాలని పట్టుబట్టారు. ఆ తర్వాత వారి ప్రోత్సాహంతోనే చిత్రపరిశ్రమలోకి వచ్చాను. వైఫల్యమే ఉత్తమ గురువు అని తెలుసుకున్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. కథలు, పాత్రలతో కనెక్ట్ అయితే.. అంతకు మించి ఆలోచించను. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాను. నేను దర్శకుడి నటిని. దర్శకుడికి, నటులకి మధ్య ఉండే అనుబంధమే ముఖ్యమని నమ్ముతాను".



## క్లైమాక్స్ చెబితేనే చేస్తానన్న నాగార్జున.. 40వేల నుంచి 2 లక్షలకు పెరిగిన భక్తులు.. 'శ్రీరామదాసు'కు 20ఏళ్లు

**తెలుగు సినీ చరిత్రలో భక్తిరస చిత్రాలకు కొదవేమీ లేదు. అయితే, కొన్ని చిత్రాలు ఎప్పటికీ ఎవర్‌గ్రీన్. అలాంటి వాటిలో 'శ్రీరామదాసు' (Sri Ramadasu) ఒకటి. రాఘవేంద్రరావు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున (Nagarjuna) కథానాయకుడిగా నటించిన చిత్రమిది. 'అన్నమయ్య' తర్వాత ఈ కాంబినేషన్‌లో వచ్చిన మరో హిట్ చిత్రం. ఇటీవల శ్రీరామనవమి వేడుకలు దేశమంతా వైభవంగా జరిగాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వేడుకల్లో 'శ్రీరామదాసు' (sri ramadasu movie songs) పాటలు లేని కల్యాణ వేడుక లేదంటే అతిశయోక్తి కాదు. అంతలా శ్రోతలను మైమరపింపజేశాయి. 'శ్రీరామదాసు' విడుదలై నేటికి (మార్చి 30) 20ఏళ్లు పూర్తి చేసుకుంది.**



క్లైమాక్స్ చెబితేనే సినిమా చేస్తానన్న నాగార్జున

''అన్నమయ్య' విడుదలై చాలా సంవత్సరాలు అయింది. మళ్లీ నాగార్జునతో ఒక భక్తిరస చిత్రం చేయాలని రాఘవేంద్రరావు అనుకున్నారు. ఆస్థాన రచయిత జేకే భారవిని పిలిచి కథ సిద్ధం చేయించారు. వెళ్లి నాగార్జునకు చెప్పమన్నారు. భారవి ఆయన ఇంటికి వెళ్లగానే నాగార్జున ఒక్కటే చెప్పారు. 'అన్నమయ్యను మించిన క్లైమాక్స్ ఇంకొకటి ఉంటుందని అనుకోను. దానికి మించి గొప్ప క్లైమాక్స్ లేకపోతే 'రామదాసు' చేయను. ముందు క్లైమాక్స్ చెప్పండి తర్వాత మూవీ చేయాలా? వద్దా? అన్నది చెబుతా' అన్నారట. అయితే, అందుకు భారవి సరే అంటూనే 'ముందు ఒకట్రెండు సన్నివేశాలు చెబుతా. ఆ తర్వాత క్లైమాక్స్ వివరిస్తా' అని అనడంతో నాగార్జున కూడా ఓకే అన్నారు. 10 నిమిషాలు విన్న తర్వాత సినిమా చేస్తానని నాగ్ అన్నారట.

**అన్నమయ్యలో అలా.. శ్రీరామదాసులో ఇలా..**

అన్నమయ్య తర్వాత వచ్చే ఇంకో భక్తుడి సినిమా 'శ్రీరామదాసు' కావడంతో ఇందులోనూ క్లైమాక్స్ హైలైట్‌గా నిలవాలని అనుకున్నారు. కానీ, దాని కన్నా మించి ఏదైనా చేయాలని రాఘవేంద్రరావు భావించారు. సాధారణంగా ఏదైనా ఊళ్లో గుడి కడితే, అక్కడకు మొదటిసారి వెళ్లిన వాళ్లు 'గుడి బాగా కట్టారండీ..' అనగానే అక్కడున్న వాళ్లు 'మన దేముందండీ..దేవుడే దగ్గరుండి కట్టించుకున్నాడు' అంటారు. ఆ పాయింట్ ఆధారంగా దేవుడే నేలపైకి వచ్చి శ్రీరామదాసు కడుతున్న గుడిని చూస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన నుంచే ఇంటర్వెల్ తీర్చిదిద్దారు రాఘవేంద్రరావు. అది క్లైమాక్స్ కంటే పవర్‌ఫుల్‌గా ఉండటంతో అందరూ ఆశ్చర్యపోయారు.

'శ్రీరామదాసు' ఆసక్తికర విషయాలు..

'అన్నమయ్య'కు స్వరాలు సమకూర్చిన ఎం.ఎం. కీరవాణినే ఈ చిత్రానికీ సంగీతం అందించారు. మొత్తం చిన్నా, పెద్ద పాటలు.. కీర్తనలు కలిపి 19 ఉన్నాయి. వాటి నిడివే 48 నిమిషాల 59 సెకన్లు. అక్కినేని నాగేశ్వరరావు ఇందులో కబీర్‌దాస్‌గా అతిథి పాత్రలో మెరిశారు. అన్నమయ్యలో శ్రీవేంకటేశ్వరస్వామిగా కనిపించిన సుమన్ ఇందులో శ్రీరాముడిగా నటించారు. సీత పాత్రను అర్చన పోషించారు.


**'శ్రీరామదాసు' 67 సెంటర్లలో 100 రోజులు ఆడింది.**

ఉత్తమ కుటుంబ వీక్షణ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ కేటగిరీల్లో నంది అవార్డులు వచ్చాయి.

ఉత్తమ గాయకుడిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఉత్తమ సినిమాటోగ్రాఫర్‌గా ఎస్.గోపాల్‌రెడ్డి ఫిల్మ్‌ఫేర్ (సౌత్) అవార్డులు దక్కించుకున్నారు.

అప్పటివరకూ భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు సుమారు 2540 వేల మంది హాజరైతే 'శ్రీరామదాసు' విడుదలైన తర్వాత 2.50లక్షల మంది హాజరయ్యారట.

జేకే భారవి ఆయన టీమ్ సినిమా కోసం 40 రోజులు భద్రాచలంలో ఉన్నారు. అప్పుడు పర్ణశాల వద్ద ఒకే ఒక షాపు ఉండేదట. ఈ సినిమా విడుదలయ్యాక వెళ్లి చూస్తే దాదాపు 250 షాపులు వెలిశాయట. సినిమా కోసం పర్ణశాల సెట్ వేశారు రాఘవేంద్రరావు. 'శ్రీరామదాసు' చూసి పర్ణశాల ప్రాంతానికి వెళ్లిన భక్తులు 'సినిమాలో ఉన్నట్లు ఇక్కడ లేదే..' అని మాట్లాడుకోవడం తన దృష్టికి వచ్చిందని రాఘవేంద్రరావు ఓ సందర్భంలో చెప్పారు.




## 'ధురంధర్ 2'తో అణుబాంబు పేల్చాడు.. వారి మౌనంపై ఆర్జీవీ పోస్ట్

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన (Ram Gopal Varma) అన్నారు. ''ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా (Dhurandhar 2) అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో''

'కళ్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి'' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటి భాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల (రూ.1,307 కోట్లు)ను ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది.



## ప్రకాశ్ రాజ్‌కు మాతృ వియోగం

నటుడు ప్రకాశ్ రాజ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తల్లి సువర్ణలత (86) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె సోమవారం ఉదయం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈరోజు సాయంత్రం బెంగళూరులో సువర్ణలత అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సువర్ణలత మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. ''శ్రీమతి సువర్ణలత గారు కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ప్రకాశ్ రాజ్, ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'' అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.



# ఐపీఎల్ పోరు.. శుభ్‌మన్ X శ్రేయస్



ఐపీఎల్ 19లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్.. గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, గుజరాత్ సారథి శుభ్‌మన్ గిల్‌పైనే అందరి దృష్టి ఉంది. భారత టీ20 జట్టులో లేని ఈ ఇద్దరు స్టార్లు.. ఐపీఎల్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. గతేడాది శ్రేయస్ సారథ్యంలో ఫైనల్‌కు వచ్చి.. ఆఖరి మెట్టుపై తడబడిన పంజాబ్.. ఈ సీజన్లో ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం. బ్యాటర్‌గానూ శ్రేయస్ రాణించడం ఆ జట్టుకు ఎంతో కీలకం. గతేడాది అతడు 50పైన సగటుతో 604 పరుగులు చేశాడు. ఈ ఏడాది న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడిన శ్రేయస్‌కు టీ20 ప్రపంచకప్‌లో పోటీపడిన భారత జట్టులో చోటు దక్కలేదు. 2022లో అరంగేట్ర సీజన్లోనే టైటిల్‌ను అందుకుని.. తర్వాతి ఏడాది రన్నరప్‌గా నిలిచిన గుజరాత్ ఆ తర్వాత ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోతోంది. హర్దిక్ పాండ్య ముంబయికి వెళ్లిపోవడంతో 2024లో పగ్గాలు అందుకున్న శుభ్‌మన్.. గత సీజన్లో జట్టును బాగానే నడిపించాడు. అతడి సారథ్యంలో గుజరాత్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించినా.. ఎలిమినేటర్‌లో ఓడి నాలుగో స్థానంలో నిలిచింది. బ్యాటర్‌గా శుభ్‌మన్ స్థిరంగానే ఆడుతున్నా.. స్ట్రైక్‌రేటే సమస్యగా ఉంది. టీ20 కెరీర్ స్ట్రైక్‌రేట్ 138గా ఉన్న శుభ్‌మన్..గతేడాది ఐపీఎల్‌లో 155 స్ట్రైక్‌రేట్‌తో 15 మ్యాచ్‌ల్లో 650 పరుగులు చేశాడు. అతడు భారత టీ20 జట్టులో స్థానం ఆశిస్తే మరింత వేగంగా ఆడక తప్పదు.

# శీతల్ దేవి.. 2025 ఉత్తమ పారా ఆర్చర్



రెండు చేతులూ లేకపోయినా, మొక్కవోని పట్టుదలతో ఆర్చరీలో అంతర్జాతీయ స్థాయికి ఎదగడమే కాక.. కొన్నేళ్లుగా అద్భుత ప్రదర్శన చేస్తున్న శీతల్ దేవికి అత్యున్నత పురస్కారం దక్కింది. ఈ జమ్ముకశ్మీర్ అమ్మాయిని ప్రపంచ ఆర్చరీ సమాఖ్య 2025 సంవత్సరానికి ఉత్తమ పారా ఆర్చర్‌గా ఎంపిక చేసింది. 19 ఏళ్ల శీతల్.. గత ఏడాది దక్షిణ కొరియాలో జరిగిన ప్రపంచ పారా ఆర్చరీ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం గెలిచింది. ఈ టోర్నీలో మహిళల టీమ్ విభాగంలో రజతం, మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం కూడా నెగ్గింది. ఆమె 2024 పారిస్ పారాలింపిక్స్‌లోనూ మిక్స్‌డ్ టీమ్ కాంస్యం సాధించింది. చేతుల్లేకుండా ఆర్చరీలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి క్రీడాకారిణి ఆమే. ఆర్చరీకి ప్రధానంగా ఉపయోగించేది చేతులే. కానీ ఆ అవయవాలు లేకుండా జన్మించిన శీతల్.. కాళ్లు, పాదాలు, భుజం, మెడను ఉపయోగించి విల్లుతో బాణాలు వేయడం సాధన చేసి, ఈ ఆటలో నైపుణ్యం సాధించింది. "ప్రపంచ అత్యుత్తమ పారా ఆర్చర్లతో పాటుగా నా పేరును నామినేట్ చేయడం.. ఇప్పుడు ఈ పురస్కారం దక్కడం పట్ల ఎంతో సంతోషంగా ఉంది. నా హృదయం కృతజ్ఞత, ఉద్వేగంతో నిండిపోయింది. ధన్యవాదాలు" అని శీతల్ చెప్పింది.

## భారత టీటీ జట్టు కోచ్‌గా సోమ్‌నాథ్

ఐటీటీఎఫ్ పురుషులు, మహిళల ప్రపంచకప్‌లో పాల్గొంటున్న భారత టేబుల్ టెన్నిస్ జట్టుకు హైదరాబాద్‌కు చెందిన సోమ్‌నాథ్ ఘోష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. సోమవారం మకావులో మొదలైన ఈ టోర్నీ.. ఏప్రిల్ 5 వరకు జరుగుతుంది. ఏప్రిల్ 28 నుంచి మే 10 వరకు లండన్‌లో జరిగే 100వ ఐటీటీఎఫ్ ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్ ఫైనల్స్‌లోనూ భారత జట్టుకు సోమ్‌నాథ్ కోచ్‌గా సేవలు అందించనున్నాడు.



# రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం

## రాయల్స్ బౌలర్ల విజృంభణ.. కుప్పకూలిన సీఎస్కే

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఇవాళ (మార్చి 30) జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు చెలరేగిపోయారు. వీరి ధాటికి సీఎస్కే బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. గౌహతిలోని బర్సపరా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ చేసిన రాయల్స్ సీఎస్కేను 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసింది.తొలి బంతి నుంచే రాయల్స్ బౌలర్లను ఎదుర్కొనేందుకు సీఎస్కే బ్యాటర్లు తెగ ఇబ్బంది పడ్డారు. ఆరంభ ఓవర్లలో నంద్రే బర్గర్, జోఫ్రా ఆర్చర్ నిప్పులు చెరిగారు. రెండో ఓవర్ చివరి బంతికి తొలిసారి సీఎస్కే తరఫున ఆడుతున్న సంజూ శాంసన్‌ను (6) బర్గర్.. మూడో ఓవర్ చివరి బంతికి సీఎస్కే సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను (6) ఆర్చర్ అద్భుతమైన బంతులతో క్లీన్ బౌల్డ్ చేశారు. ఆమరుసటి బంతికే (3.1 ఓవర్) యువ ఆటగాడు ఆయుశ్ మాత్రేను బర్గర్ మరో అద్భుతమైన బంతితో డకౌట్ చేశాడు.ఆతర్వాత మాథ్యూ షార్ట్‌ను (2) సందీప్ శర్మ.. సర్ఫరాజ్ ఖాన్ (17), శివమ్ దూబేను (6) రవీంద్ర జడేజా ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపారు. కొద్ది సేపటికే కార్తీక్ శర్మను (18) బ్రిజేశ్ శర్మ.. నూర్ అహ్మద్‌ను (1) జోఫ్రా ఆర్చర్ ఔట్ చేశారు. మరి కొద్ది సేపటికి మ్యాట్ హెన్రీని (5) రవి బిష్ణోయ్ పెవిలియన్‌కు పంపగా.. ఓవర్టన్ (43) ఔట్ కావడంతో సీఎస్కే ఇన్నింగ్స్‌కు ఎండ్ కార్డ్ పడింది.చివర్లో ఓవర్టన్ అనూహ్యమైన పోరాటాన్ని ప్రదర్శించడంతో సీఎస్కే 100 పరుగుల మార్కును దాటగలిగింది. అతనికి అన్షుల్ కంబోజ్ (7 నాటౌట్) సహకరించాడు. రాయల్స్ బౌలర్లలో ఆర్చర్, బర్గర్, రవీంద్ర జడేజా తలో 2.. బ్రిజేష్ శర్మ, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. సీఎస్కే ఇన్నింగ్స్‌లో ఓవర్టన్‌తో పాటు కార్తీక్ శర్మ (18, సర్ఫరాజ్ ఖాన్ (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగా.. సంజూ శాంసన్, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబే తలో 6, మాథ్యూ షార్ట్ 2, నూర్ అహ్మద్ 1, మ్యాట్ హెన్రీ 5, ఆయుశ్ మాత్రే డకౌటయ్యారు.



# రోహిత్ 2.0 రెడీ..

## ప్రత్యర్థులూ ఇక కాచుకోండి: అనిల్ కుంబ్లే




ఐపీఎల్ 2026 సీజన్‌ను రోహిత్ శర్మ సూపర్ ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టాడు. 200+ స్ట్రైక్‌రేట్‌తో హాఫ్ సెంచరీ సాధించిన అతడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. కేవలం 38 బంతుల్లోనే 78 పరుగులు చేసిన ముంబయి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే (Anil Kumble) ఐపీఎల్‌లోని మిగతా జట్లను సున్నితంగా హెచ్చరించాడు. రోహిత్ 2.O (Rohit Sharma 2.O) వచ్చేసిందని.. ప్రత్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించాడు. "కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూశాక.. ఒకటే చెబుదామని ఉంది. రోహిత్ 2.O రెడీ.. మిగతా టీమ్‌లు జాగ్రత్తగా ఉండాలి అని చెబుతా. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపినట్లు అనిపిస్తోంది. అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని వంటి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం అంత ఈజీ కాదు. అలవోకగా సిక్స్‌లు కొట్టేశాడు. తన ఫిట్‌నెస్ పైనా చాలా శ్రమించాడు. స్వల్ప విరామం తర్వాత మైదానంలోకి అడుగుపెడితేనే.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజులు పడుతుంది. కానీ, రోహిత్‌పై ఆ ప్రభావం ఏమీ చూపించినట్లు లేదు. తాజాగా కనిపించాడు. సిక్స్‌లు తనదైన శైలిలో తేలికగా బాదేశాడు. మైదానం కాస్త చిన్నదైనా సరే.. ఆ బంతి చాలా దూరం వెళ్లి స్టాండ్స్‌లో పడింది. అతడి దూకుడు చూస్తూ ఈ ఐపీఎల్ సీజన్‌లో తన ఉద్దేశం ఏంటో బ్యాట్‌తోనే చెప్పేశాడు" అని కుంబ్లే తెలిపాడు.

**ఆ విషయం ఆశ్చర్యమేసింది......** "కోల్‌కతా బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయకపోయడం ఆశ్చర్యపరిచింది. రోహిత్‌రికెల్టన్ దూకుడు మీదున్న పవర్‌ప్లేలో అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం నిరుత్సాహపరిచింది. నరైన్ బౌలింగ్‌కు వచ్చేటప్పటికే నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను దెబ్బతీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా వినియోగించుకోవాలి" అని కుంబ్లే సూచించాడు.

# వైభవ్ విధ్వంసం..

## రాజస్థాన్ రాయల్స్ విజయం




ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ శుభారంభం చేసింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్కే 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. 128 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (52; 17 బంతుల్లో) చెలరేగాడు. ఇందులో 4 ఫోర్లు, 5 సిక్స్‌లున్నాయి. అతడు కేవలం 15 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ సాధించడం విశేషం. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ధ్రువ్ జురేల్ (18; 9 బంతుల్లో, 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. రియాన్ పరాగ్ 14 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లు తీసుకున్నాడు. మిగతా బౌలర్లు విఫలమయ్యారు. అంతకు ముందు చెన్నై సూపర్‌కింగ్స్ బ్యాటర్లలో ఎనిమిదో స్థానంలో వచ్చిన జేమీ ఓవర్టన్ (43; 36 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సర్ఫరాజ్ ఖాన్ 17, కార్తిక్ శర్మ 18 రన్స్ చేశారు. సంజు శాంసన్ (6), రుతురాజ్ గైక్వాడ్ (6), ఆయుష్ మాత్రే (0), మాథ్యూ షార్ట్ (2), శివమ్ దూబె (6) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు పడగొట్టారు. బ్రిజేశ్ శర్మ, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్ చెరో వికెట్ తీసుకున్నారు.

# ప్రజ్ఞానంద గేమ్ డ్రా



క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్లో తొలి గేమ్ గెలిచిన భారత స్టార్ ప్రజ్ఞానంద.. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. సోమవారం జరిగిన ఓపెన్ విభాగం పోరులో ప్రజ్ఞానంద 46 ఎత్తుల్లో వీయ్ యీ (చైనా)తో పాయింట్ పంచుకున్నాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)ఫాబియానో కరువానా (అమెరికా), సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)మతియాస్ బ్లూబమ్ (జర్మనీ) మధ్య గేమ్‌లు కూడా డ్రా అయ్యాయి. ప్రజ్ఞానంద (1.5 పాయింట్లు).. కరువానా, సిందరోవ్‌తో ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల్లో దివ్య దేశ్‌ముఖ్‌వైశాలి మధ్య గేమ్‌లోనూ ఫలితం తేలలేదు. ఒక్కో పాయింట్ సాధించిన దివ్య, వైశాలి.. మరో ఆరుగురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

# మనిక పరాజయం



ఐటీటీఎఫ్ పురుషులు, మహిళల ప్రపంచకప్‌లో భారత్‌కు శుభారంభం దక్కలేదు. సోమవారం మకావులో ఆరంభమైన ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ గ్రూప్ తొలి మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ మనిక బత్రా 1618, 411, 611తో మివా హరిమోటో (జపాన్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ గ్రూప్ ఆరంభ పోరులో మానవ్ థక్కర్ కూడా ఓడిపోయాడు. అతడు 711, 611, 811తో పార్క్ హెయాన్ (కొరియా)కు తలొంచాడు. తర్వాతి మ్యాచ్ లిలీ జాంగ్ (అమెరికా)తో మనిక..ట్రూల్స్ (స్వీడన్)తో మానవ్ థక్కర్ తలపడనున్నారు.

# పాక్ ఆటగాళ్లపై బాల్ టాంపరింగ్ ఆరోపణలు

పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో బాల్ టాంపరింగ్ వివాదం దుమారం రేపుతోంది. గడాఫీ స్టేడియంలో కరాచి కింగ్స్‌తో మ్యాచ్‌లో లాహోర్ ఖలందర్స్ ఆటగాళ్లు ఉద్దేశపూర్వకంగా బంతి ఆకారాన్ని మార్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫకార్ జమాన్, షహీన్ అఫ్రిది, హారిస్ రవూఫ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే తాము ఎలాంటి తప్పు చేయలేదని.. ఆరోపణల్లో వాస్తవం లేదని ఆ ముగ్గురూ స్పష్టంచేశారు. కరాచి కింగ్స్ చివరి ఓవర్లో 14 పరుగులు చేయాల్సిన స్థితిలో ఫకార్, రవూఫ్, కెప్టెన్ షహీన్ చర్చించుకుంటూ కనిపించారు. బంతి వీరి చేతులు మారింది. ఆ వెంటనే అంపైర్ ఫైసల్ అఫ్రిది బంతిని తనిఖీ చేసి.. దాని ఆకారం మారినట్లు తేల్చాడు. లాహోర్ ఖలందర్స్‌కు అయిదు పరుగుల పెనాల్టీ విధించి.. బంతిని మార్చాడు. లక్ష్యం 9 పరుగులకు తగ్గిపోవడంతో రవూఫ్ బౌలింగ్‌లో అబ్బాస్ అఫ్రిది ఫోర్, సిక్సర్‌తో కరాచికి విజయాన్ని అందించాడు. పీఎస్ఎల్ ప్రవర్తన నియమావళి ప్రకారం ఫకార్‌పై లెవెల్ 3 నేరం కింద మ్యాచ్ రిఫరీ రోషన్ మహానామా అభియోగాలు నమోదు చేశాడు. ఈ వివాదంపై 48 గంటల్లో తుది తీర్పు వెలువడే అవకాశముంది. బంతి ఆకారాన్ని మార్చినట్లు తనకు తెలియదని.. అంపైర్ నిర్ణయం నిరాశ కలిగించిందని షహీన్ తెలిపాడు. టాంపరింగ్‌ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఓ సీనియర్ అధికారి చెప్పాడు. మరోవైపు భద్రత నిబంధనలు ఉల్లంఘించి జట్టు హోటల్ గదిలోకి తన బంధువులను తీసుకొచ్చినందుకు సికందర్ రజా (లాహోర్)పై పీసీబీ క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

